

పెండింగ్ బిల్లుల పంచాయితీ

» పులుముకుంటోన్న రాజకీయ రంగు
» గత ప్రభుత్వ వైఖరే కారణమంటోన్న అధికార పార్టీ
» 90శాతం బీఆర్‌ఎస్ మద్దతుదారులే ఉండడంతో దిక్కుతోచని స్థితి
» దాదాపు రెండేళ్లుగా విడుదల కాని రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు
» నాలుగు నెలలుగా 15వ ఆర్థిక సంఘం నిధులూ పెండింగ్‌లోనే
» రెండేళ్ల నుంచి క్లియర్‌కాని ఉపాధి పథకం పనుల బిల్లులు
» ప్రతీ పంచాయతీలో రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకు పెండింగ్
» మరో పది రోజుల్లో ముగియనున్న పాలకవర్గాల గడువు
» బిల్లులపై ఆందోళనలో సర్పంచులు

పంచాయతీల నిధులు రాక ప్రజాప్రతినిధులు పరేషాన్‌లో ఉన్నారు. దీనికితోడు రాజకీయ రంగప్రవేశం వారిని కుంగదీస్తోంది. అసలే పాలన గడువు ముగియనుండడంతో పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటన్నది మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రస్తుత అధికార పార్టీ వారు గత ప్రభుత్వ వైఖరి వల్లే ఈ దుస్థితికి కారణమంటుండగా, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ వారు మాత్రం పెండింగ్ బిల్లులు ఇచ్చేదాకా పోరాటం చేస్తామంటుండడం గమనార్హం. చిన్న పంచాయతీ మొదలుకొని పెద్ద పంచాయతీల్లో రూ.10 లక్షల నుంచి రూ. కోటి దాకా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఒకపక్క పెండింగ్ బిల్లుల రాక.. మరోపక్క పాలన గడువు రోజుల వ్యవధిలో తీరిపోనుండటం.. ఇంకోపక్క రాజకీయం చోటుచేసుకుంటుండటంతో సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.



నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం చిన్నపొర్లలో చేపట్టిన సీసీరోడ్డు పనులు (ఫైల్)

మహబూబ్‌నగర్, నారాయణపేట రెండు జిల్లాల్లో కలిపి పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి ప్రధానంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి 22 నెలలకు పైగా నిధులు విడుదల కాలేదని చెబుతున్నారు. వీటితో పాటు ఎన్నికల కారణంగా నాలుగు నెలలుగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా ట్రెజరీల్లో ఆగాయని పేర్కొంటున్నారు. వీటితో పాటు ఉపాధి హామీ పథకం కింద దాదాపుగా

● రెండు జిల్లాల్లో రూ. 200 కోట్ల పైచిలుకు పెండింగ్ బిల్లులు

రెండేళ్ల నుంచి వివిధ పనులకు సంబంధించి అరకొర తప్ప నిధులివ్వలేదని, దీంతో మొత్తంగా రెండు జిల్లాలలో 821 పంచాయతీల్లో దాదాపు రూ.200 కోట్లపైచిలుకు నిధులు సర్పంచులకు రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రతీ త్రైమాసికానికి బిల్లులు చెల్లిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని, అలా చేయకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని సర్పంచులు వాపోతున్నారు. మరో పది రోజుల్లో సర్పంచులు, మొత్తం పాలకవర్గాల గడువు ముగియనుండడంతో బిల్లుల కోసం ఏం చేయాలనే అంశంపై సర్పంచులు మల్లగుల్లాలు పడుతున్న పరిస్థితి నెలకొంది.

మహబూబ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులపై రాజకీయం రగులుతోంది. సర్పంచ్ సహా పాలకవర్గాల గడువు మరో పది రోజుల్లో ముగియనుండడం, ఈలోపు పెండింగ్ బిల్లులు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో సర్పంచుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ దుస్థితికి గత ప్రభుత్వ వైఖరే కారణమని అధికార పార్టీ నేతలు ప్రకటిస్తుంటే, బిల్లులివ్వకపోతే ఆందోళనలు చేస్తామని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పేర్కొనడం పెండింగ్ బిల్లులపై జరగబోయే రాజకీయాన్ని సూచిస్తోంది. సర్పంచులలో 90 శాతం పైగా బీఆర్‌ఎస్‌కు చెందినవారే ఉండడంతో, పార్టీ అధికారంలో ఉన్న సమయంలో బిల్లుల కోసం నిలదీయలేకపోయామని ఇప్పుడు సర్పంచులు లోలోన మథనపడుతున్న పరిస్థితి నెలకొంది. చిన్నపంచాయతీ మొదలుకొని పెద్ద పంచాయతీల వరకు రూ.10లక్షల నుంచి రూ. కోటి వరకు బిల్లులు పెండింగ్ పడడం, దాదాపు రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు జమకాకపోవడం, గత నాలుగు మాసాలుగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రాకపోవడం, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టిన పనులకూ బిల్లులు రాకపోవడం, మరోవైపు పాలకవర్గ గడువు ముగియనుండడంతో సర్పంచుల పరిస్థితి కక్కలేక మింగలేక అన్నట్లుగా తయారైంది.

● రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకు పెండింగ్ బిల్లులు

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని 821 గ్రామపంచాయతీల్లో దాదాపు అన్ని పంచాయతీల్లో పెద్ద ఎత్తున చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీసీరోడ్లు, వైకుంఠధామాలు, మట్టిరోడ్లు, డ్రైనేజీల పనులకు సంబంధించిన బిల్లులు దాదాపు రెండేళ్ల నుంచి రావడం లేదు. . ఎంబీ రికార్డులు సమర్పించిన వెంటనే బిల్లు మొత్తానికి చెక్కులు మంజూరయినా, ట్రెజరీల్లో నిధుల్లేక, పంచాయతీల ఖాతాల్లోకి నిధులు జమకాకపోవడంతో సర్పంచులకు నిధులందని పరిస్థితి నెలకొంది. చిన్నపంచాయతీలు మొదలుకొని పెద్ద పంచాయతీల వరకు కనిష్ఠంగా రూ.10లక్షల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు.



మక్తల్ మండలం పంచ్‌దేవ్‌పాడులో బిల్లులు రాకపోయినా నిర్మాణం పూర్తయిన గ్రంథాలయ భవనం

● పెండింగ్ బిల్లుల తీరిది....!

మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం చాకలిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ భవననిర్మాణానికి సంబంధించి రూ.25లక్షలు, సీసీరోడ్లకు సంబంధించి రూ.7లక్షలు, పంచాయతీ నిర్వహణకు రూ.3లక్షలు, అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ పనుల నిమిత్తం రూ.5లక్షల నిధులు కలిపి మొత్తం రూ.30లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మరో పది రోజుల్లో గడువు ముగిస్తే తమ పరిస్థితి ఏమటో అర్థమవడం లేదని సర్పంచ్ రాములమ్మ వాపోయారు. రాజాపూర్ మండలంలోని మల్లేపల్లి గ్రామంలో సీసీరోడ్లకు సంబంధించి రూ.5లక్షలు, పంచాయతీ భవన మరమ్మతులకు రూ1.5 లక్షలు, మట్టిరోడ్డుకు రూ.3 లక్షలు, మన ఊరు-మన బడి కింద రూ.2లక్షలు కలిపి రూ.11.50 లక్షల పెండింగ్ బిల్లులు రావాలని సర్పంచ్ శ్యాంబాయి పేర్కొన్నారు. తమకు ఎంబీలు చేయగా, నిధుల్లేక ట్రెజరీలో ఆగిపోయాయని, ఏడాదిగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని తెలిపారు. బాలానగర్ మండలంలో ప్రతి పంచాయతీలో దాదాపు రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని, 15వ ఆర్థిక సంఘం, రాష్ట్రార్థిక సంఘం నిధులు రాకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్ పేర్కొన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలో గ్రామీణ క్రీడా ప్రాంగణం కింద రూ.3.50 లక్షల నిధులు రావాల్సి ఉందని, పనులు చేసి దాదాపు 20 నెలలు కావస్తుందని, మన ఊరు- మన బడి కింద చేసిన పనులకు అప్పటి ఏఈ రూ.1లక్ష తక్కువ బిల్లు ఇచ్చారని, సాధారణ పనులకు సంబంధించి రూ.3లక్షలకు నిధులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచు మంజుల వాపోయారు. తమకు గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి, ప్రహరీకి సంబంధించి రూ.35 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వడ్డీలకు తెచ్చి పనులు చేయించామని, బిల్లులు రాక ఏడాదిగా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని గండీడ్ మండలం కొంరెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

● నారాయణపేట జిల్లాలోనూ ఇదే పరిస్థితి..!

ఉట్కూరు మండలం చిన్నపొర్ల గ్రామంలో ఎంబీ రికార్డులు చేసినా బిల్లులు మంజూరు కాని నిధులు రూ.23లక్షలు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ.20లక్షలు కలిపి మొత్తం రూ.43లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచ్ రవీందర్‌రెడ్డి వాపోయారు. వీటిల్లో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు దాదాపు వచ్చాయని, రాష్ట్ర ఆర్థికసంఘం కోటాలో రావాల్సిన రూ.25 లక్షల నిధులు ఈ ఏడాది కాలంగా ఇవ్వడం లేదని, దీంతో తమకు అవస్థ ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పులు చేసి పనులు చేశామని, రెండేళ్లుగా పెండింగ్ బిల్లులు పేరుకపోవడంతో వడ్డీల భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. మక్తల్ మండలం పంచ్‌దేవ్‌పాడులో రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రూ.13లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇతర నిధుల ద్వారా చేపట్టిన డ్రైనేజీలు, శ్మశానవాటిక, జీపీ మరమ్మతులు, ఉపాధి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ.10లక్షలు కలిపి మొత్తం రూ.33లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏడాదిన్నరగా బిల్లులురాక అవస్థలు పడుతున్నామని సర్పంచ్ కల్పన వాపోయారు. మద్దూరు మండలం పల్లెర్లలో రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రూ.10లక్షలతో సీసీరోడ్డు, హెల్త్‌సెంటర్ మరమ్మతులు, హైమాస్ట్ లైట్లకు రూ.రూ.3లక్షలు, ఇతర పనులు చేపట్టామని, బిల్లులు రాకపోవడంతో ఏడాదిన్నరగా అవస్థ పడుతున్నామని వాపోయారు. నారాయణపేట రూరల్ మండలంలో ఉపాధి హామీ పథక ంకింద చేపట్టిన పనులతో పాటు, ఎస్‌ఎఫ్‌సీ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ.30 లక్షలు పెండింగ్ బిల్లులున్నాయని సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు.

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీ

- కొనసాగుతున్న శివాంజనేయస్వామి జాతర



గిరకబండ్ల పోటీలో తలపడుతున్న సేద్యపుటెద్దులు



ఇసుక సంచి ఎత్తే పోటీలో విజేత పరశురాం

ఇటిక్యాల, జనవరి 18 : నడిగడ్డలోని వావిలాల శివాంజనేయస్వామి జాతరలో భాగంగా గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. దొబ్బుడు గుండ్ల పోటీలో వెంకటాపురం లాలు 160 కిలోల రాయిని ఎత్తి ప్రథమ బహుమతిగా అయిదు వేల రూపాయలు గెలుచుకున్నారు. మేడికొండ రాజు ద్వితీయ, కిష్టాపురం జనార్దన్ తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. సందెరాళ్ల పోటీల్లో బల్గెరకు చెందిన హన్మంతు 96 కిలోల రాయిని ఎత్తి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. రెండవ బహుమతిని మిట్టదొడ్డి ఉరుకుందు, మూడవ బహుమతిని గట్టు పరశురాములు దక్కించుకున్నారు. గుబ్బలగుండ్లు ఎత్తు పోటీల్లో జూలకల్ రంగస్వామి 128 కిలోల రాయిని ఎత్తి మొదటి బహుమతిగా అయిదు వేల రూపాయలు గెలుచుకున్నారు. పచ్చర్ల షకీల్ ద్వితీయ, పచ్చర్ల సూరి తృతీయ స్థానంలో నిలిచారు. ఇసుక సంచులు ఎద్దే పోటీల్లో దేవదుర్గకు చెందిన పరశురాంనాయక్ వంద కిలోల సంచిని ఎత్తి మొదటి విజేతగా నిలిచారు. పర్దిపురం తిరుమలేష్ ద్వితీయ, ఇర్సిగేరి శంకరప్ప తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. విజేతలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులను అందించారు. గిరకబండ్ల పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 36 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చిరుత సంచారంపై భయాందోళన

● కొనసాగుతున్న పశు సంపదపై దాడి



బోడగట్టుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)



చిరుత అడుగు జాడలు (ఫైల్)

ఖిల్లాఘణపురం, జనవరి 18: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని గ్రామాల్లో గత రెండు నెలలుగా చిరుత సంచారంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని పరిసర గ్రామాల్లో గుట్టల ప్రాంతం అధికంగా ఉండడంతో చిరుత రోజూ స్థావరాలు మారుతుండడంతో అధికారులు గుర్తించడం కష్టతరంగా మారింది. గ్రామాల్లోని రైతులు రాత్రి వేళల్లో పంట పొలాల వద్దకు పోవడానికి చిరుత సంచారం చేస్తుందని భయంతో సేద్యం చేయడానికి జంకుతున్నారు. వేరుశనగ పంటలు చివరి దశలో ఉన్నా కాపలాకు వెళ్లడానికి భయమేస్తుందని రైతులు వాపోతున్నారు. మండలంలో కమాలొద్దిన్‌పూర్ గ్రామంలో రెండు నెలల క్రితం చిరుత వెంటపడిందని ద్విచక్ర వాహనదారుడు తెలపడంతో మండలంలోని చిరుత సంచా రంపై ప్రజల్లో ఆందోళన మొదలైంది. గత నెల డిసెంబరు ఎనిమిదిన మండల కేంద్రంలోని పిల్లివాగు దగ్గర వేరుశనగ పంట పొలాల్లో చెట్టు పైకి ఎక్కడంతో వేప చెట్టు బెరడులు ఊడిపోవడంతో పాటు లేగదూడను చంపి తిన్న దృశ్యాలను రైతు చూపిం చాడు. గుట్టలోకి వెళ్లిపోయిందని చెప్పిన ప్రత్యక్ష సాక్షి వివరాలు పట్టించుకోకపోవడంతో డిసెంబరు 21న ఈర్లతండా మల్కిమియాన్‌పల్లి గ్రామ శివారులలోని బోడగట్టు గుట్టపై సంచారాన్ని ఈర్లతండా డబుల్ బెడ్ రూమ్‌లో నివాసముండే గ్రామస్థులు చిరుత సంచరించే దృశ్యాలను సీసీ కెమెరాలలో బంధించారు. అనంతరం గట్టు చుట్టూ అటవీశాఖ అధికారులు నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు సీసీ కెమెరాలలో ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని వాటిని తొలగించారు. వారం రోజుల అనంతరం మల్కిమియాన్‌పల్లి శివారు ప్రాంతంలోని పశువుల షెడ్డు దగ్గర చిరుత కంటపడడంతో పాడి రైతు గ్రామస్థులతో కలిసి కేకలు వేయడంతో తప్పించుకుని వెళ్లింది. మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో బుధవారం రోజు గొల్ల చౌడయ్య కుమారుడు సురేష్, గొర్రెల కాపరి మీసాల బాలప్ప పొలంలో గొర్రెలను మేపుతుండగా సాయంత్రం వేళ మందపై చిరుత దాడి చేసి గొర్రెను ఎత్తుకెళ్లి చంపింది. చుట్టుపక్కల ఉన్న రైతులు కేకలు వేయడంతో గొర్రెను అక్కడే వదిలేసి పారిపోయింది. అటవీశాఖ అధికారులు పరిశీలించి గొర్రెల కాపరికి నష్టపరిహారం అందిస్తామని తెలిపారు.



బస్సు వంతెనపై కాలినడకన ప్రయాణికులు

బోసిపోయిన వంతెన

- కాలినడకన వెళ్తున్న ప్రయాణికులు

కృష్ణ, జనవరి 18 : నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని గుడెబల్లూరు గ్రామ శివారులో 167వ నెంబర్ జాతీయ రహదారిలో కృష్ణానదిపై ఉన్న బస్సు వంతెనను మరమ్మతు దృష్ట్యా కర్ణాటక ప్రభుత్వం మూసివేసింది. దీంతో నిత్యం హైదరాబాద్ నుంచి రాయచూరు, తమిళనాడు, కేరళ, గోవా వివిధ రాష్ట్రాలకు కర్ణాటక మీదుగా వెళ్లే వాహనాలతో రద్దీగా ఉండే బస్సు వంతెన వాహనాల దారి మళ్లింపుతో గురువారం బోసి పోయింది. దీంతో చిరు వ్యాపారులు, హోటల్, దాబాలు, పెట్రోల్ బంకులో విక్రయాలు నిలిచిపోయాయని స్థానిక వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి నిత్యావసర వస్తువుల కొనుగోలు చేయడానికి, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కంపెనీకి వెళ్లే కార్మికులు, కూరగాయలు అమ్మే వారు, పాడి రైతులు బస్సు వంతెనపై కాలినడక ద్వారా దేవసూగూరుకు వెళ్లి వస్తున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లి వస్తున్న ప్రయాణికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దేవసూగూరులో బస్సు దిగి కాలినడకన చెక్‌పోస్టుకు చేరుకొని అక్కడి నుంచి ఇతర వాహనాల ద్వారా గమ్యస్థానాలకు వెళ్తున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మారుమోగిన గోవింద నామస్మరణ

» సింగోటం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
» రథోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జనవరి 18: గోవిందా... గోవిందా... లక్ష్మీనరసింహస్వామి గోవిందా అను నామస్మరణం కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో మారుమోగింది. కోరిన కోరికలు తీర్చే మహిమ గల లక్ష్మీనరసింహుడిగా పేరుగాంచిన సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం గురువారం కనుల పండువగా కొనసాగింది. రథోత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష్మీనరసింహుడిని భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

వేద పండితులు సంపత్ శర్మ నేతృత్వంలో కొనసాగిన మంత్రోచ్చారణల మధ్య రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆలయ ధర్మకర్త ఎస్‌వీకేకేటీ సురభి ఆదిత్య లక్ష్మణ్ రావులు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవా న్ని ప్రారంభించారు. రథాన్ని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి రత్నలక్ష్మీ ఆలయం వ ద్ద ఉన్న జమ్మి చెట్టు వరకు భక్తులు లాగుతూ గోవిందా...గోవిందా...లక్ష్మీన ర సింహ స్వామి గోవిందా అను నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. తిరిగి రథాన్ని ఆలయం వరకు చేర్చారు. సింగోటం శ్రీవారి స ముద్రం కట్టపై వేలాది మంది భక్తులు నిల్చుని రథోత్సవాన్ని తిలకించారు. లక్ష్మీనర సింహున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకు న్నారు.

● బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే వేలాది మంది భక్తులకు ఎలాంటి అవస్థలు ఏర్పడకుండా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్‌ల ఆదేశానుసారం జిల్లా యంత్రాంగం వసతులు సమకూర్చింది.

జాతర పరిసరాల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ నేతృత్వంలో మొబైల్ వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొల్లాపూర్ సీఐ యాలాద్రి నేతృత్వంలో భారీ పోలీస్ బందోబస్తు చేపట్టారు.

● ఆధ్యాత్మిక కేంద్రంగా సింగోటం గ్రామాన్ని తీర్చిదిద్దుతా

ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. దక్షిణ ప్రాంతంలో మరో యాదాద్రిగా లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు ఆధ్యాత్మికంతో పాటు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతామని జూపల్లి విలేకర్లతో పేర్కొన్నారు.

● కోనేరు గుండంలో భక్తుల స్నానాలు

సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు ఆలయ పరిసరాల్లో ఉన్న కోనేరు గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సింగోటం శ్రీవారి సముద్రంలో మరబోటు ప్రయాణం చేసి ఆహ్లాదంగా గడిపారు. మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బోట్‌లో మంత్రి విహారం

సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి సముద్రంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు విహరించారు. నిండుకుండలా జలకళతో ఉన్న శ్రీవారి సముద్రంలో స్పీడ్‌బోటు ప్ర యాణం చేసి మంత్రి కాసేపు ఆహ్లాదంగా గడిపారు. అంతకు ముందు ఆలయంలో మంత్రి తనయుడు జూపల్లి అరుణ్‌రావు లక్ష్మీనరసింహున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



రథోత్సవం పైకి ఉత్సవర్లను తీసుకువస్తున్న భక్తులు



స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు



స్వామి వారి ఊరేగింపులో మహిళల పూనకం



రథోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు



సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ






బీజేపీ సభ్యత్వానికి సతీష్ మాదిగ రాజీనామా

అచ్చంపేట టౌన్, జనవరి 18 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వానికి సతీష్‌మాదిగ రాజీనామా చేశారు. పార్టీ తనను సస్పెండ్ చేయడం బాధేసిందని, ఏ కారణం లేకుండానే సస్పెండ్ చేయడం అర్థం కాలేదని కాబట్టి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సతీష్‌మాదిగ అన్నారు. గురు వారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. అచ్చంపేట అసెంబ్లీ ఎన్నికల్లో నా మీద కుట్ర చేసిన వ్యక్తుల గురించి, నా ఓటమికి గల కారణా ల గురించి ఫిర్యాదు చేశానని నేను నాగర్‌కర్నూల్ ఎంపీ సీటుకు ప్రయత్నం చేస్తున్న సమయంలో పార్టీ సస్పెండ్ చేసినట్లు సోషల్ మీడియాలో లెటర్ పెట్టారని ఎందుకు అలా జరిగిందో తెలియదన్నారు. నాకు షోకాజ్ నోటీసు లు ఇవ్వకుండా ఇలా చేయడం బాధేసిందన్నారు. నా వివరణ తర్వాత సస్పెండ్ చేసే అధికారం మీకు ఉంది.. కానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుం డా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి టికెట్ కేటాయించి ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలన్నారు. ముఖ్యంగా బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలియజేశానన్నారు. బీజేపీ సభ్యత్వానికి, రాష్ట్ర కార్యవర్గ పదవికి రాజీనామా చేస్తున్నానన్నారు.





కామన్ సర్వీసు కేంద్రాలుగా

ప్రాథమిక సహకార సంఘాలు

▸▸ అయిజలో ఎరువులు, పురుగుల మందులు, సూపర్ మార్కెట్ల ఏర్పాటు





అయిజలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్, ఎర్రవల్లి చౌరస్తాలోని సింగిల్‌విండో కార్యాలయం

అయిజ, జనవరి 18 : ప్రాథమిక సహకార సంఘాలు కామన్ సర్వీస్ కేంద్రాలుగా రైతులతో పాటు ప్రజలకు సేవలు అందించనున్నాయి. గతంలో రైతులకు రుణాలు ఇవ్వటం, ఎరువులు, విత్తనాలు అందజేసే సంస్థగా మాత్రమే గుర్తింపు పొందింది. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా కామన్ సర్వీసు సేవలు అందించనున్నారు. కేంద్రంలో ప్రత్యేకంగా సహకార శాఖ ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేయాలని భావించి వివిధ రకాల కార్యక్రమాలు అమలు పరచాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే ఇప్పటికే నేషనల్ కో ఆపరేటివ్ డేటా బేస్‌లో వివరాలను ఆయా సహకార సంఘాలు అప్‌లోడ్ చేశాయి. ఇందులో భాగంగానే రాష్ట్రస్థాయిలో కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పాటు

మొదటిసారిగా జిల్లా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లాలో కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా డీసీవోతో పాటు మరో 12మంది అధికారులు ఉంటారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు పాడి పరిశ్రమ సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలను కామన్ సర్వీస్ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేశారు. త్వరలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సమావేశాలు జరగనున్నాయి. వీటి నిర్వహణపై సంఘాల కార్యదర్శులకు అవగాహన కల్పించారు. వీటి ద్వారా 300 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో ప్రధానంగా ఆధార్, పాన్ సర్వీస్, రైల్వే, బ్యాంకు బీమా సేవలు అందించనున్నారు.

సర్వీసు కేంద్రాలుగా అందించనున్న సేవలు

ప్రాథమిక సహకార సంఘాలు కామన్ సర్వీసు కేంద్రాలుగా ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు ఇప్పటికే అర్హత గల సహకార సంఘాలకు అనుమతులు వచ్చాయి. సర్వీసు కేంద్రాలుగా ఎరువులు, పురుగుల మందులు విక్రయాలు, మెడికల్ దుకాణాల నిర్వహణ, గ్రామీణ ప్రాంతాల్లో మైక్రో ఏటీఎంలు ఏర్పాటు చేయవచ్చు. సహకార సంఘాల సభ్యులందరికీ కిసాన్ కార్డులు అందించటం, రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటు చేసి సేవలు అందించాలి. పెట్రోల్, డీజిల్ బంకుల ఏర్పాటు, ఎల్‌పీజీ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అద్దెకు వ్యవసాయ పరికరాలు అందించవచ్చు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందని గ్రామాలలో నీటి శుద్ధి జల కేంద్రాల ద్వారా ప్రజలకు నీరు అందించవచ్చు.

అయిజ సింగిల్ విండోకు అనుమతి వచ్చింది



అయిజ సింగిల్‌విండో ద్వారా కామన్ సేవలు అందించడానికి అనుమతి పత్రం లభించింది. రెండు సంవత్సరాలుగా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సరసమైన ధరలకు నాణ్యమైన మందులు విక్రయిస్తున్నాం. ప్రస్తుతం సూపర్ మార్కెట్ ప్రారంభించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. పులికల్ గ్రామంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులతో పాటు ప్రజలకు సేవలు చేసుకునే అవకాశం కల్పించింది.

- సహకారం సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డి

పానీపూరి బండ్లకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

గండీడ్, జనవరి 18 : గుర్తు తెలియని వ్యక్తులు గప్‌చుప్ బండ్లకు నిప్పంటించిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాహుల్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు 15ఏళ్లుగా గప్‌చుప్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఇంటి ముందు నిలుపగా, వారిని బెదిరించి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గప్‌చుప్ బండ్లకు నిప్పంటించారు. నాలుగు చక్రాల బండి ఒకటి పూర్తి కాలిపోగా మరో బండికి కొంతమేర కాలింది. ఈ ఘటనలో సుమారు రూ. 60 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

- సన్మానసభలో సర్పంచు వెంకట్‌రాంరెడ్డి



గాధిర్యాల్‌లో వార్డు మెంబర్లను సన్మానించిన సర్పంచు వెంకట్‌రాంరెడ్డి

మహమ్మదాబాద్, జనవరి 18 : అందరి సహకారంతో గ్రామాభివృద్ధి చేశామని సర్పంచు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు గ్రామాభివృద్ధికి ఐదేళ్లు సహకరించిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండంతో గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములమ్మ, ఉపసర్పంచు రామకృష్ణ, కార్యదర్శి మాజీ, వార్డు సభ్యులు వెంకటయ్య, అంజిలయ్య, జి.అంజిలయ్య, లక్ష్మమ్మ, అంజిలమ్మ, చిన్న హన్మయ్య, వెంకట్‌రాంరెడ్డి, శంకరయ్య, మైపాల్‌రెడ్డి, డి. కృష్ణయ్య, చిన్న బుగ్గయ్య, వెంకటయ్య, సి.వీరేషం పాల్గొన్నారు.

గగ్గలపల్లిలో మూడు ఇళ్లు, జిల్లా కేంద్రంలో ఒక షాపులో చోరీ

▸▸ పన్నెండున్నర తులాల బంగారం, 31 తులాల వెండి, రూ.లక్షా 51వేల నగదు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ కిరాణ దుకాణం, మండలంలోని గగ్గలపల్లి గ్రామంలోని మూడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. నాగర్‌కర్నూల్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్ర కారం.. గగ్గలపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ సంక్రాంతి పండుగ సం దర్భంగా హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. గురువారం ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లో ఉన్న రూ.లక్షా 25 వేల నగదు, పదకొండున్నర తులాల బంగారం, 25 తులాల వెండిని గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. అదే గ్రామానికి చెందిన బాలమ్మ ఇంట్లో రూ.10 వేల నగదుతో పాటు, ఒక తులం బంగారం, ఆరు తులాల వెండి అపహరించుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన శ్రీశైలం ఇంట్లో కూడా ఎవరూ లేకపోవడంతో దొంగలు చొరబడి పెట్టెలో ఉన్న రూ.10 వేల నగదు అపహరించుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా, జిల్లా కేంద్రంలోని నాగనూల్ రోడ్డులో గల సహస్ర కిరాణ షాపు వెనక నుంచి లోపలికి ప్రవేశించిన దుండగులు రూ.ఆరు వేల నగదు, ఎనిమిది కిలోల జిలకర్ర సంచితో పాటు, దాదాపు రూ.40వేల వరకు ఖరీదైన వస్తువులను అపహరించుకునిపోయినట్లు షాపు యాజమాని బిల్లకంటి రవికుమార్ తెలిపారు. ఈ సంఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



ఆలయాన్ని శుద్ధి చేసిన డీకే అరుణ



ఆలయ శుద్ధిలో పాల్గొన్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మక్తల్, జనవరి 18 : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆలయ శుద్ధిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆలయాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఆలయంలో చెత్త, చెదారం తొలగించి నీటితో శుద్ధి చేసినట్లు తెలిపారు. శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను ప్రతీ ఇంటా వేడుకలా జరుపుకోవాలన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని ఇండ్లకు అయోధ్య అక్షితలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా దేశ ప్రజలంతా రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనలో పాల్గొనాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ బాల్రెడ్ పావనీ, వైస్ చైర్‌పర్సన్ అఖిల, జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, కర్నిస్వామి, రాజశేఖర్‌రెడ్డి, బల రాంరెడ్డి, కౌన్సిలర్లు ప్రసన్న, కౌసల్య కొండయ్య, మహాదేవ్, రాకేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

బొలెరో, బైక్ ఢీ : వ్యక్తి మృతి

చిన్నంబావి, జనవరి 18 : బొలెరో వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నదగడ గ్రామానికి చెందిన బక్కి రాజేందర్ (45) అనే వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. దాంతో స్థానికులు వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. బాధితకుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎండు మిర్చి దగ్ధం



దగ్ధమైన ఎండు మిర్చి

లింగాల, జనవరి 18 : విద్యుదాఘాతంతో ఎండు మిర్చి దగ్ధమైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం బాకారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శ్రీపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని సొంత వ్యవసాయ పొలంలో రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్లు తెలిపారు. మిర్చిని తెంపి వ్యవసాయ పొలంలోనే ఆరబోశానని, అయితే పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రాత్రి ఎండు గడ్డి కాలుతూ మంటలు ఆరబోసిన మిర్చికి తాకినట్లు తెలిపారు. దాదాపు 16 క్వింటాళ్ల ఎండుమిర్చి కాలి బూడిదైనట్లు వాపోయాడు. పంట సాగు కోసం రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టానని తెలిపాడు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

నర్వ, జనవరి 18 : రేషన్ బియ్యం పట్టుబడింది. నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్‌చేడ్, నర్వ గ్రామాల మధ్యలో ఆటోలో తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి ఏడు గంటలకు నర్వ పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆటోలో ఉన్న ముగ్గురు యువకులను ఆరా తీయగా జంగంరెడ్డిపల్లె, ఉందేకోడ్ గ్రామాల్లో రూ.10 కిలో చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం మరో ఆటోలో కొత్తపల్లె గ్రామం నుంచి తరలిస్తున్న నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

సంగంబండలో..

మక్తల్, జనవరి 18 : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంగంబండ గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తి ఇంట్లో ఏడు బస్తాల పీడీఎఫ్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ పర్వతాలు గురువారం తెలిపారు. చట్టబద్దంగా ఎవరైనా బియ్యం తరలించినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

మక్తల్, జనవరి 18 : ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొన్న మక్తల్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. జూనియర్ షూటింగ్‌బాల్ బాలుర విభాగంలో జస్వంత్ గౌడ్ (నేరడగం), ఆర్ మోహన్ (గుర్లపల్లి) బంగారు పతకాలు, బాలికల విభాగంలో తీరుతాజ్ పురోహిత్, ఊట్కూర్ శివమ్మ వెండి పతకాలు సాధించారు. సీనియర్ మహిళా విభాగంలో స్వప్న కాంస్య పతకం, పురుషుల విభాగంలో తిలక్‌సింగ్‌రాజ్ (మక్తల్) వెండి పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, అందుకు కృషి చేసిన రమేష్‌కుమార్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్మానించి అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జనవరి 18 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారంలో రూ. 16 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. సింగోటం-గోపాల్‌దిన్నె రిజర్వాయర్ల అనుసంధాన కాలువను పూర్తి చేసి సాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని తెలిపారు. సమావేశంలో సర్పంచు పద్మ పాపన్న, ఎంపీటీసీ సభ్యురాలు కవిత కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్య నాయకులు సుదర్శన్‌రెడ్డి, కృష్ణయ్య, నారాయణరెడ్డి, రఘునాథ్ రెడ్డి, గంగిరెడ్డి, శివ,వెంకటస్వామి, జుర్రు నరసింహ, హుస్సేన్, నరసింహ పాల్గొన్నారు.

మైనింగ్ సీజ్

దేవరకద్ర, జనవరి 18 : దేవరకద్ర మండల కేంద్రంలోని గూరకొండ వెళ్లే దారిలో ఓ ఇంటి ముందున్న కంకర మైనింగ్‌ను గురువారం సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ విజయకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూడగా ఓ ఇంటి ముందు మైనింగ్ పెద్ద మొత్తంలో ఉండటంతో సీజ్ చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఏమైనా పత్రాలు ఉంటే తమకు సమర్పించి మైనింగ్ తీసుకోవచ్చన్నారు. లేనిచో ఎవరైనా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట సర్వేయర్, ఆర్ఐ సురేష్ ఉన్నారు.

కులమతాలకతీతంగా..

రంగాపూర్ జాతర

▸ దర్గాలో మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ▸ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

▸ చోద్యం చూస్తున్న ఎక్సైజ్ సిబ్బంది ▸ పేరుకుపోతున్న చెత్తాచెదారం



భక్తులతో రద్దీగా మారిన రంగాపూర్ దర్గా



దర్గాలో మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, జనవరి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలో జాతర ప్రారంభమైంది. కులమతాలకతీతంగా జాతరకు భక్తులు పోటెత్తారు. గ్రామంలోని నిరంజన్ షావలి దర్గాలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బుధవారం రాత్రి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలో అతిపెద్ద జాతరగా పేరొందిన రంగాపూర్ ఉర్సు ఉత్సవాల్లో కలెక్షన్ల పర్వం తాండవిస్తోంది. గ్రామాన్ని రెండు పంచాయతీలుగా విడదీసిన అధికారులు జాతరలో మాత్రం సిండికేట్‌గా మారి అందినకాడికి దోచేసుకుంటున్నారు. ప్రతీఏటా జనవరి 17 నుంచి ప్రారంభమయ్యే జాతర దాదాపు పదిరోజుల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో దుకాణాల ఏర్పాటు కోసం తైబజార్ వసూలు చేయడమే కాకుండా కొబ్బరికాయల వేలంతో పాటు వాహనాల నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఒక్కో కొబ్బరికాయ రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయించాల్సింది పోయి జాతరను అదునుగా చూసుకొని ఏకంగా రూ.70లకు విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అమ్మకందారులు మాకే రూ.55కు విక్రయిస్తున్నారని మోహం మీదనే చెప్పేస్తున్నారు. ఇదిలా ఉండగా రంగాపూర్ జాతరకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు, డీసీఎంల నుంచి రూ.250లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దేవుడు మొక్కు తీర్చుకుందామని వచ్చే భక్తులకు ఇదేమి వడ్డెన అంటూ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జాతరలో తాండవిస్తున్న సమస్యలు

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకునేందుకు గ్రామ పంచాయతీలు పెద్ద మొత్తంలో తైబజార్ వసూలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా జాతరలో మాత్రం సమస్యలు తాండవిస్తున్నాయి. దర్గా సమీపంలోనే తినిపడేసిన ఇస్తరాకులు, పారుతున్న మురుగునీటితో దర్గా ప్రాంగణం అస్తవ్యస్తంగా మారింది. దర్గా పరిసరాలు చెత్తచెదారంతో నిండి ఉండటంతో జాతరకు వచ్చే భక్తులు దర్గాకు దూరంగా రోడ్ల వెంట తమ వాహనాలను నిలుపుకొని కందూర్లు చేస్తున్నారు.

ఉమామహేశ్వర క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

▸ నందివాహన సేవలో పార్వతీపరమేశ్వరులు

శ్రీశైలం ఉత్తరముఖ ద్వారం శ్రీఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. ఉమామహేశ్వరం క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు భోగమహేశ్వరం నుంచి మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం స్వామివారిని నందివాహన సేవలో ఊరేగింపుగా ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు తీసుకెళ్లి అక్కడ స్వామి వారికి గంగాజలంతో అభిషేకాలు నిర్వహించి అనంతరం ఆలయం గర్భగుడి వరకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, సహస్ర నామార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం ఐదు గంటలకు నందివాహనసేవ, ఇతర విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ అన్నిరకాల చర్యలు తీసుకున్నారు. అచ్చంపేట డీఎస్పీ, సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో ఎస్సై గోవర్ధన్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కొండపైకి భక్తులను చేరవేసేందుకు డీఎం ప్రసాద్ అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి నాలుగు మినీ బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

అక్రమ నియామకాలు

▸ ఓ కౌన్సిలర్ తమ్ముడి పేరు మీద అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఎంపిక

▸ అర్హత లేని 28 మందితో ఉద్యోగాల భర్తీ

▸ ఓ ప్రజాప్రతినిధి సిఫారసుతో అక్రమాలకు తెరతీసిన అధికారులు

▸ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఇదీ పరిస్థితి



ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కార్యాలయం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జనవరి 18 : 'వడ్డించే వాడు మనోడైతే కూర బంతిలో కూర్చున్నా అందుతుంది' అనే చందంగా ఓ ప్రజా ప్రతినిధి అండదండలతో అధికారులు అక్రమ నియామకాలకు తెరలేపారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఓ కౌన్సిలర్ తమ్ముడి పేరుమీద అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని ఎంపిక చేసి అర్హత లేని 28 మందికి అప్పనంగా ఉద్యోగాలు అప్పగించారు. ఇదంతా ఓ ప్రజాప్రతి నిధి సిఫారసుతో అధికారులు అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన అక్రమ నియామకాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

నోటిఫికేషన్ లేకుండానే ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం 2022 సంవత్సరం డిసెంబరులో జిల్లాకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఓ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఏడీ, ఆఫీస్ సబార్డినేట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఓ జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కూడా కేటాయించింది. దీంతో పాటు మరో 28 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా నియమించుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే అక్రమ నియామకాలకు తెరలేపారు. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి తన అనుచరుడైన ఓ కౌన్సిలర్ తమ్ముడి పేరుతో జె.కె.కె అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని ఎంపిక చేశారు. వాస్తవానికి ఏజెన్సీని ఎంపిక చేయడానికి, ఉద్యోగ నియామకాలు చేపట్టడానికి నోటిఫికేషన్ వేయాలనే నిబంధనలను పక్కన పెట్టారు. ఆ ప్రజాప్రతినిధి ఇచ్చిన పేర్లను ఎంపిక చేసి వారికే ఉత్తర్వులు ఇచ్చారు. ఇందుకు జిల్లా ఉన్నతాధికారులు సైతం సంతకాలు పెట్టడం విశేషం.

అర్హత లేని 28 మందికి ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారికి కనీసం విద్యార్హత ఇంటర్, డిగ్రీ ఉండాలి. కానీ, 7, 10వ తరగతి చదివిన వారికి సైతం అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చేశారు. ఇందులో డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరు, ఇద్దరు రికార్డ్ అసిస్టెంట్, ఇద్దరు హౌస్ కీపర్స్, ఆరుగురు శానిటేషన్, ఒక దోబీ, ఒక ఎలక్ట్రీషియన్, ఇద్దరు కుక్, ఇద్దరు కిచెన్ బాయ్స్, ఇద్దరు ఆఫీస్ అటెండర్లు, నలుగురు సెక్యూరిటీ, ఒక అసిస్టెంట్ లైబ్రేరియన్, ఒక లైబ్రేరియన్ అసిస్టెంట్, ఇద్దరు ల్యాబ్ అటెండెంట్ ఉన్నారు. వీరందరికి నియామక పత్రాలు సైతం ఆ ప్రజాప్రతినిధి చేతుల మీదుగా క్యాంపు కార్యాలయంలో ఇచ్చారు.

సిబ్బంది ఇష్టారాజ్యం

అవుట్ సోర్సింగ్ కింద నియామకమైన 28 మందిలో ఏ ఒక్కరికి నైపుణ్యాలు లేవు. వారికి ఇష్టం వచ్చినపుడు రావడం, ఇష్టం వచ్చినపుడు పోవడం చేస్తున్నారు. ఇదేంటని అడిగే ధైర్యం అధికారులు కూడా చేయలేకపోవడం విశేషం. ప్రతీ రోజు విధులకు వచ్చేది 28 మందిలో సగం మందే. వారికి కూడా పనిలో అనుభవం లేకపోవడంతో కళాశాల అధికారులే నెట్టుకుపోయారు. వారు పనికి రాకపోయినా హాజరు మాత్రం వందశాతం వేయాల్సిందే. వారికి ఇష్టం వచ్చినపుడు సెలవులు తీసుకుంటారు. అనుమతులు లేకుండా కూడా సెలవులపై వెళతారు.

కలెక్టర్ అనుమతితోనే నియామకాలు

తమ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని, సిబ్బందిని అప్పటి కలెక్టర్ అనుమతితోనే నియమించారు. డీటీవో, ఎంప్లాయిమెంట్, లేబర్ ఆఫీసర్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ ఎంపిక మేరకే నియామకాలు చేపట్టాం. సిబ్బంది విద్యార్హతలు, మెరిట్, రోస్టర్ అన్ని ఆ కమిటీ చూసుకుంది. ఆ ఏజెన్సీ ద్వారా నియమించిన సిబ్బందితో పనిచేయించుకున్నాం. ఆ ఏజెన్సీ పునరుద్ధరణ గడువు ఈ రెండు నెలల్లో ముగుస్తుంది. ఇకపై నియామకాలు పారదర్శకంగా చేస్తాం.

- స్వరాజ్యలక్ష్మి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ, జనవరి 18 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ ట్రాక్టర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను చెర్కూర్‌కు తరలిస్తుండగా బ్లూకోట్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి టిప్పర్లు పట్టివేత

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్‌లను పోలీసులు పట్టుకున్నారు. నారాయణపూర్ సమీపంలోని గుట్టల నుంచి ఆమనగల్లుకు చెందిన లక్ష్మన్, దేవేందర్ అనే వ్యక్తులు టిప్పర్ల సహాయంతో మట్టిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన టిప్పర్‌లను తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెల్దండ, జనవరి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో బుధవారం రాత్రి ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు, మరో బైక్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... కల్వకుర్తి వైపు నుంచి వేగంగా హైదరాబాద్‌వైపు వెళుతున్న కారు ఎదురుగా వచ్చిన కారును, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు కారులో వెళుతున్న సలీం, ద్విచక్ర వాహనదారుడు కల్వకుర్తికి చెందిన రాఘవేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా ప్రమాదంలో డిండిచింతపల్లికి చెందిన కరుణాకర్‌రెడ్డి గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సలీం కుటుంబీకుల ఫిర్యాదుతో కరుణాకర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో యువకుడికి గాయాలు

వెల్దండ, జనవరి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఊర్కొండకు చెందిన శివ అనే యువకుడు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ద్విచక్ర వాహనంపై కల్వకుర్తి వైపు వస్తున్న శివ మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు పేర్కొన్నారు.

వృద్ధురాలి దారుణహత్య



నాగమ్మ (ఫైల్)

కల్వకుర్తి, జనవరి 18 : ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి కల్వకుర్తి ఎస్ఐ రమేష్ కథనం ఇలా ఉన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన నాగమ్మ (65) ఉల్పరలో ఉన్న తన మనుమరాలి దగ్గరకు వెళ్లేందుకు మంగళవారం కల్వకుర్తికి వచ్చింది. రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నాగమ్మ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా నాగమ్మతో ఓ మహిళ మాట్లాడుతుండటాన్ని పోలీసులు గుర్తించారు. ఆటోలో తీసుకెళ్లి అచ్చంపేట మండలం రంగాపూర్ సమీపంలోని ఘాట్ రోడ్డులో నాగమ్మ వద్ద ఉన్న బంగారాన్ని లాక్కొని హత్య చేసి ఉంటారని ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, త్వరలోనే నిందితులను కస్టడీలోకి తీసుకుంటామని చెప్పారు.

సారా విక్రయిస్తే చర్యలు

మిడ్జిల్, జనవరి 18 : నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎక్సైజ్ ఎస్ఐ సృజన్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దగుండ్ల తండాతో పాటు పలు గ్రామాల్లో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పెద్దగుండ్ల తండాకు చెందిన ఓ వ్యక్తి వద్ద సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని వైన్స్ షాపును తనిఖీచేసి నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దేశమంతా

రామజపమే

▸ ఈ నెల 22న బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ

▸ అందుకు గడియారం చౌరస్తాలో ఏర్పాట్లు

▸ 11 రోజులపాటు ఉపవాస దీక్షలో ప్రధాని నరేంద్ర మోదీ



ఆలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), జనవరి 18 : ఈ నెల 22న అయోధ్యలో జరగనున్న బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకొని దేశంలో ఎక్కడ చూసినా ప్రజల నోట జై శ్రీరామ్ అంటూ రామజపం తప్ప మరో ఆలోచన లేదని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 500 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత అయోధ్యను పునర్నిర్మించుకున్నామని తెలిపారు. రాముడు, సీతా, లక్ష్మణ, హన్మంతుని సమేతంగా ఈ నెల 22న మధ్యాహ్నం 12.20 నిమిషాలకు అభిజిత్ లగ్నానికి శ్రీరామని భవ్యమందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. ఆరోజున ప్రతీ ఒక్కరు ఇళ్లల్లో ఐదు రామ జ్యోతులను వెలిగించి వేడుకలను జరుపుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉన్నందున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 రోజుల పాటు ఉపవాస దీక్ష తీసుకున్నారని తెలిపారు. దేవాలయాలకు వెళ్లి అక్కడ ప్రాంగణంలో శుభ్రత చేస్తున్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాకుల బాలరాజు, ఏపీ మిథున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి నల్లమద్ది సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బుచ్చిరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, శ్రీరాములు, యాంకి రమేష్, రఘురామ్ రెడ్డి పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయం పరిశుభ్రత

అయోధ్యలో ఈ నెల 22న జరుగనున్న బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, దేశంలోని దేవాలయాల పరిసరాలను శుభ్రంగా తీర్చి దిద్దుకునేందుకు శ్రమదానం నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గురువారం పద్మావతి కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, తన తనయుడు మిథున్‌రెడ్డి చేపట్టారు. ఆపార్టీ కార్యకర్తలు ఆలయ ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు.

గెలుపే లక్ష్యంగా కార్యాచరణ

▸ మైబూత్.. టెన్ యూత్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి..

▸ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 20 వేల మంది యువజన కాంగ్రెస్ కార్యకర్తల ఎంపిక

▸ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 18 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలలో అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యాచరణ రూపొందిస్తుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని లోక్‌సభ స్థానాల పరిధిలో యువజన కాంగ్రెస్, సోషల్ మీడియా సభ్యులతో సన్నాహక సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్, సోషల్ మీడియా సభ్యులతో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్, సోషల్ మీడియా టీమ్‌లను ఆక్టివ్ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులైన లబ్ధిదారులకు నూటికి నూరు శాతం అందేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. కార్యకర్తల కృషి కారణంగా మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో ఏడుకు ఏడు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని గుర్తు చేశారు 'మై బూత్.. టెన్ యూత్' అన్న నినాదంతో ప్రతీ బూత్‌కు 10 మంది కరుడుగట్టిన యువజన కాంగ్రెస్ సభ్యులను తయారు చేస్తామన్నారు. ఈ లెక్కన పార్లమెంట్ పరిధిలో ఉన్న 1900 పోలింగ్ బూత్‌లలో ప్రతీబూత్ నుంచి 10 మంది లెక్కన వారం రోజుల్లో దాదాపు 20 వేల మందిని తయారుచేసి రాహుల్ గాంధీ ఆలోచన విధానాలు, భారత్ జోడో సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసేలా చేస్తామని తెలిపారు. సీఎం సొంత జిల్లా అయిన పాలమూరులో రెండు పార్లమెంట్ స్థానాలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పని చేస్తామని, అభ్యర్థులెవరైనా గెలుపే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలి

▸ వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరిన జడ్పీ చైర్‌పర్సన్



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సంపత్‌కుమార్, సరిత

గద్వాల, జనవరి 18 : గద్వాలలో నూతనంగా నిర్మిస్తున్న 300 పడకల ఆసుపత్రిని 500 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో గురువారం ఆయనను కలిసి గద్వాల జిల్లాలో అందుబాటులో ఉన్న వైద్య సేవలపై చర్చించారు. గద్వాల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు నూతన ఆసుపత్రిలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాలలో సౌకర్యాలను మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడంతో పాటు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. నిర్మాణంలో గ్రామ దవాఖానాలను పూర్తి చేయాలని కోరారు. ఆమె వెంట పార్టీ నాయకుడు తిరుపతయ్య ఉన్నారు.

పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి

▸ ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అలంపూర్ చౌరస్తా, జనవరి 18 : అలంపూర్ నియోజకవర్గంలోని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. హైదరాబాదులోని మంత్రి నివాసంలో గురువారం ఆయనను కలిసి సమస్యను వివరించారు. రాజోలి మండలంలోని చిన్న ధన్వాడ, మాన్‌దొడ్డి, తనగాల, అలంపూర్ మండలంలో భీమవరం, బుక్కాపూరం, గొందిమల్ల గ్రామాలకు బస్సు సర్వీసులు నడిపించాలని కోరారు. పల్లెలకు బస్సు సర్వీసులు లేకపోవడంతో మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోలేక పోతున్నారని తెలిపారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎర్రవల్లి సర్పంచు జోగుల రవి, అంజి తదితరులున్నారు.

పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సర్పంచ్ రవి

ఎర్రవల్లి, జనవరి 18 : నూతన పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరు కావాలని సర్పంచు రవి మంత్రులను కోరారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో కలిసి గురువారం హైదరాబాద్‌లోని సచివాలయానికి వెళ్లారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లను కలిసి మాట్లాడారు. త్వరలో ప్రారంభోత్సవ తేదీని ప్రకటిస్తామని వారికి తెలిపారు.

శ్రీరామ రథానికి ఘన స్వాగతం

▸ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న వీహెచ్‌పీ నాయకులు

గద్వాల టౌన్, జనవరి 18 : అయోధ్యలో రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలో గురువారం నిర్వహించిన శ్రీరామ రథ శోభాయాత్రకు పట్టణంలోని పీజేపీ కాలనీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు ఘన స్వాగతం పలికారు. రథానికి ప్రధాన అర్చకుడు జిశేషచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకుడు, రిటైర్డ్ ఎంఈవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఆదర్శ పాలకుడు, పితృవాక్య పరిపాలకుడు శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం శోభాయాత్ర గుండు చెన్నకేశవ స్వామి ఆలయం, గంజిపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం, కోటలోని శ్రీభూలక్ష్మీ చెన్నకేశవ స్వామి, రామాలయం, పిల్లిగుండ్ల ఆంజనేయస్వామి దేవాలయం, పెద్ద అగ్రహారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో తిరుపతి ఆచారి పాల్గొన్నారు.

ఆలయాల పరిశుభ్రత ప్రతీ హిందువు బాధ్యత

▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



అలంపూర్ ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

అలంపూర్ చౌరస్తా, జనవరి 18 : ఆలయాల పరిశుభ్రత ప్రతీ హిందువు బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అలంపూర్ పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ప్రాంగణాన్ని గురువారం ఆయన ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ జరుగబోతున్నదని, అయోధ్య ఆలయంలో బాల రాముడు కొలువుదీరడం హిందువుల కల అన్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున ప్రతీ ఇంట్లో దీపం వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు, బీజేవైఎం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రాజశేఖర్‌శర్మ, నాయకులు నాగమద్దిలేటి, జగన్మోహన్‌రెడ్డి, పిడుగు వెంకటేష్, సంజీవరెడ్డి, నరసింహులు, పాల్వాయి రాముడు, నాగ మల్లయ్య, వినీత్, రంగస్వామి, పాండురెడ్డి, కృష్ణంరాజు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి 31వ తేదీ తుది గడువు

గద్వాల టౌన్, జనవరి 18 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఏఎల్‌డీ కళాశాల అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ డి. శ్రీపతినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ లేదా మీ సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ధ్రువపత్రాల పరిశీలన కోసం అధ్యయన కేంద్రానికి రావాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా, ముగ్గురికి గాయాలు

ఎర్రవల్లి, జనవరి 18 : పొట్టు ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లాలోని పెబ్బేరు నుంచి గురువారం పొట్టు లోడ్‌తో ధర్మవరం గ్రామానికి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని జింకలపల్లి స్టేజీ వద్ద బోల్తా పడింది. ట్రాక్టర్‌పై నున్న మధు, గోకారి, సత్యన్నలు గాయపడ్డారు.



శాంతినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



అయిజలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాజకీయాల్లో పెను మార్పులు తెచ్చిన ఎన్టీఆర్

▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజిపేట రాములు ▸ జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి

▸ ఘన నివాళి అర్పించిన నాయకులు, అభిమానులు ▸ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు

గద్వాల అర్బన్, జనవరి 18 : దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజిపేట రాములు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పాత బస్టాండ్, చెనుగోనిపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాడి ఆత్మగౌరవం కోసం ఆనాడు ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఇటు రాజకీయం, అటు చలనచిత్ర రంగాల్లో తెలుగు వారి ఘనతను చాటి చెప్పారన్నారు. నేటితరం నాయకులు, ప్రజలు ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి నరసింహులు, సీనియర్ నాయకుడు ఇస్మాయిల్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి శివన్న, ప్రధాన కార్యదర్శి ఉప్పల పాటి నాగరాజు, గద్వాల మండల ఉపాధ్యక్షుడు వెంకటన్న, మల్దకల్ మండల అధ్యక్షుడు బంగి గోవిందు, వెంకటరమణ, భీమేష్, వెంకటన్న, రుద్రరాజు పాల్గొన్నారు.

తెలుగు ఖ్యాతిని చాటిచెప్పిన ఎన్టీఆర్

వడ్డేపల్లి : తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని, కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లిన మహనీయుడు, దివంగత ఎన్టీఆర్ అని టీడీపీ సీనియర్ నాయకుడు పూర్ణచంద్రారావు కీర్తించారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణసూరి, నాయకులు వెంకటరామన్, రామ్మోహన్, వెంకటేశ్వరరావు, పేపర్ మహేష్, కిష్టన్న, గోపాలరావు, చాణిక్య, సాయిచరణ్ ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ ఆద్యుడు

అయిజ : ప్రజా సంక్షేమ పథకాలకు ప్రవేశపెట్టిన ఆద్యుడు ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తూముకుంట ఈరన్నగౌడు, చాకలి నాగన్న, శ్రీధర్, కడ్లె శివరాజ్, కండక్టర్ వెంకటేష్, భీమన్న, వీరన్నగౌడు, కృష్ణరెడ్డి, వెంకట్‌నాయుడు, లాయర్ వెంకటేష్ పాల్గొన్నారు.



గద్వాలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

▸ ఎంపీడీవోలు, ఎంపీవోల పాత్ర కీలకం ▸ కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జనవరి 18 : గ్రామీణ అభివృద్ధిలో ఎంపీడీవోలు, ఎంపీవోల పాత్ర కీలకమని, వారు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు చేస్తున్న పనులపై ఆరా తీశారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనుల గురించి ఎంపీడీవోలు ఆయనకు వివరించారు. డీఆర్‌డీఏ, డీపీవో పరిధిలో చేస్తున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో ప్రతీ సమస్యకు తక్షణమే స్పందించేలా మండల అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ పనులు, ఇంటి పన్నుల వసూలు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టరు అపూర్వచౌహాన్, డీఆర్‌డీఏ కాంతమ్మ, డీపీవో శ్యాంసుందర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

సన్మానించిన విశ్రాంత ఉద్యోగులు

కలెక్టర్ బీఎం సంతోష్‌ను గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఐడీవోసీ కార్యాలయంలో వారు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రధర్, కార్యదర్శి కృష్ణారెడ్డి, బాలకిషన్‌రావు, వెంకటరమణ, వెంకట్రాములు, హనుమంతు పాల్గొన్నారు.

పనుల పురోగతిపై దృష్టి సారించాలి

జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టి సారించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. అధికారులందరూ సమష్టిగా కృషి చేసి, పనులు పూర్తి చేయాలని చెప్పారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ప్రణాళికను సిద్ధం చేయాలి

▸ నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : ఎంపీడీవో చెన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చెన్నయ్య

గద్వాల, జనవరి 18 : గ్రామ పంచాయతీ ప్రణాళికను వెంటనే తయారు చేసి ఇవ్వాలని ఎంపీడీవో చెన్నయ్య కార్యదర్శులను ఆదేశించారు. తన చాంబర్‌లో గురువారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైన తర్వాత, నిబంధనల ప్రకారం వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. టైడ్ గ్రాంట్స్, అన్‌టైడ్ గ్రాంట్స్‌కు అనుగుణంగా ప్రణాళిక ఉండాలని సూచించారు. ఇప్పటికే జిల్లా పరిషత్ కార్యాలయం ప్రణాళికను పూర్తి చేసిందని, మండల పరిషత్‌తో పాటు గ్రామ పంచాయతీలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలుపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31 నాటికి వంద శాతం వసూలు పూర్తి కావాలని సూచించారు. త్వరలో ప్రత్యేక అధికారి పాలన రావచ్చన్నారు. ఇప్పటి వరకు ఏ సమస్య వచ్చినా ప్రజలు సర్పంచులకు చెప్పుకునేవారని, ఇక నుంచి కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు.

మందుల దుకాణాలపై పర్యవేక్షణ కరువు

▸ జిల్లాకు రాని ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ▸ మెడికల్ దుకాణాలు, ఏజెన్సీల ఇష్టారాజ్యం

గద్వాల న్యూటౌన్, జనవరి 18 : జిల్లాలోని మందుల దుకాణాలపై పర్యవేక్షణ కరువయ్యింది. ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నా, ఆయన గద్వాలకు రావడం లేదు. దీంతో మందుల దుకాణాలు, ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రిస్కిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదని, కనీస నిబంధనలు కూడా పాటించడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాలోని ధరూర్, గట్టు, కేటీదొడ్డి, నందిన్నె, అయిజ, మల్దకల్ తదితర మండలాల్లోని ఆర్‌ఎంపీలు తమ దగ్గరకు వచ్చే రోగులకు ఎక్కువ మోతాదులో ఉన్న యాంటిబయాటిక్ మందులు రాస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ మందులను ఎక్కువగా వినియోగించడం సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదముందని నిపుణులు చెప్తున్నారు. వారికి అనుబంధంగా ఉన్న మెడికల్ దుకాణాల్లో వారు రాసే మందులనే విక్రయిస్తున్నారని తెలుస్తోంది.



అధికారి లేకపోవడంతో తాళం వేసి ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

చర్యలు తీసుకుంటాం

గద్వాలలో అధిక మోతాదులో యాంటి బయాటిక్స్ విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటాం. ఇక్కడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఉన్న మహమ్మద్‌రఫీ జడ్చర్లలో విధులు నిర్వహిస్తూ, గద్వాలకు కూడా రావాల్సి ఉంది. కొంత సమయభావం వల్ల ఇక్కడికి సకాలంలో రాలేకపోతున్నారు. అధిక మోతాదులో యాంటిబయాటిక్స్ వేసుకుంటే ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలి.

– దినేష్, అసిస్టెంట్ డైరెక్టర్

పాత భవనంలోనే కార్యాలయం

జిల్లాకేంద్రంలోని అన్ని కార్యాలయాలు నూతన కలెక్టరేట్‌లోకి మారి నెలలు గడుస్తున్నా, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మాత్రం పాత భవనంలోనే కొనసాగిస్తున్నారు. కొంత కాలం క్రితం జిల్లాకు ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. ఆయన మరో జిల్లా బాధ్యతలు కూడా చూస్తున్నందున జిల్లాకు రావడం లేదు. ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఒక్కసారి జిల్లాకు వచ్చి వెళ్లారని తెలుస్తోంది. దీంతో జిల్లా కేంద్రంలోని కార్యాలయం ఎప్పుడూ మూసే ఉంటోంది. దీంతో మెడికల్ ఏజెన్సీలు, మందుల దుకాణాల్లో తనిఖీలు చేసే వారే కరువయ్యారు. కాగా ఓ ప్రైవేట్ వ్యక్తి మాత్రం మందుల దుకాణాలు, ఏజెన్సీల నుంచి అధికారుల పేరుతో ముడుపులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్న సూచనలు వినిపిస్తున్నాయి.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

అయిజ, జనవరి 18 : మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని అయిజ ఎస్‌ఐ నరేశ్ తల్లిదండ్రులకు సూచించారు. పట్టణంలోని చిన్నతాండ్రపాడు టీ రహదారిలో గురువారం మధ్యాహ్నం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలను నడుపొద్దని తెలిపారు. అందరూ చట్టప్రకారం నడుచుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

మల్దకల్, జనవరి 18 : ఆదిశిలా క్షేత్రమైన స్వయంభువు శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సుబ్రహ్మణ్య స్వామి, నాగవిగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా అర్చకులు ప్రసన్నాచారి, నరేష్, శ్రీధర్, ప్రాణేష్, జయతీర్థశర్మల ఆధ్వర్యంలో పుణ్యావాచనం, దేవతా ఆహ్వానం, ధాన్యాధివాసం, వాస్తు హోమం తదితర విశేష పూజలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ దాత పరిమళ గోవిందు కులకర్ణి, నాగవిగ్రహ దాత గాండ్ల అన్నపూర్ణరాజశేఖర్ ఆధ్వర్యంలో తయారు చేయించిన ద్వితీయ, ఉత్తర వైకుంఠ ద్వారాలను శుక్రవారం బెంగుళూరు మఠం గొబ్బూరు 1008 సువిదేంద్ర తీర్థుల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, శేషదాస వంశస్థులు ధీరేంద్రదాసు, భీంసేనాచారి, మధుసూదనాచారి, అరవిందరావు, రవి, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ, బాబురావు పాల్గొన్నారు.

‘జీవో నెంబర్ 19ని రద్దు చేయాలి’

గట్టు, జనవరి 18 : కురుమ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ కుల ధ్రువపత్రాల ఇవ్వకుండా జీవో నెంబర్ 19ని రద్దు చేయాలని అల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితుల విద్య, ఉద్యోగ, రాజకీయ ప్రయోజనాలను అక్రమంగా పొందేందుకు ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే జీవో నెంబర్ 19ని తీసుకొచ్చారని తెలిపారు. దళితులకు అందే ఫలాలను దోపిడీ చేయాలనే ఆలోచనతో, అర్హులైన వారికి అన్యాయం చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం ప్రతీ మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి, తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

టాలెంట్ టెస్టు కరపత్రాలు విడుదల

మల్దకల్, జనవరి 18 : నడిగడ్డ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించనున్న టాలెంట్ టెస్టు కరపత్రాలను గురువారం మల్దకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం నరేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. నడిగడ్డ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ టెస్టుకు కేజీబీవీ, గురుకులాలు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ ఫోరం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జాకీర్, క్రాంతికుమార్, భాస్కర్, జ్యోతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, జనవరి 18 : జిల్లాలోని మైనార్టీ గురుకుల (బాలికలు, ఇంగ్లీష్ మీడియం) పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదు నుంచి ఎనిమిదవ తరగతి వరకు, ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ) మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి ఆరవ తేదీలోగా తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే గద్వాల లేదా అలంపూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఫిబ్రవరి ఆరవ తేదీలోగా నేరుగా దరఖాస్తులు సమర్పించొచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

రేపు మల్దకల్‌లో ఓటరు నమోదు

మల్దకల్, జనవరి 18 : తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశం మేరకు జనవరి 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హరిబాబు తెలిపారు. ఈ రెండు బీఎల్‌వోలు తమ పోలింగు కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాతో హాజరు కావాలన్నారు. ఓటరు జాబితాలో మార్పుల కోసం ఫాం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్‌టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ

అయిజ, జనవరి 18 : ప్రముఖ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ చిత్రపటాలతో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఆయన అభిమానులు ఆవిష్కరించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అభిమానులు శివరాజ్, శ్రీధర్, కండక్టర్ వెంకటేష్, భీమన్న, కృష్ణారెడ్డి, వెంకట్‌నాయుడు, లాయర్ వెంకటేష్ పాల్గొన్నారు.